
ఆంధ్రజ్యోతి



గుంటూరు
జిల్లా వార్తలు

5

గురువారం 4 జనవరి 2024



గుంటూరు : కలెక్టరేట్ వద్ద రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



గుంటూరులో కలెక్టరేట్ ముట్టడిలో సొమ్మసిల్లి పడిపోయిన అంగన్‌వాడీ కార్యకర్త

నిరసనాగ్రహం

డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. మూడు వారాల నుంచి సమ్మె చేస్తున్న అంగన్ వాడీ లు బుధవారం కలెక్టరేట్ల ముట్టడికి పిలుపిచ్చారు. పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించినా అంగన్‌వాడీలు కలెక్టరేట్ల ముట్టడి ని జయప్రదం చేశారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి అంగన్ వాడీలు జిల్లా కేంద్రాలకు చేరుకోవడంతో రహదారులన్నీ ఆందోళన కారులతో నిండిపోయాయి. వందల సంఖ్యలో పోలీసులతో కలెక్టరేట్ల దగ్గర పహారా పెట్టి భయానక వాతావరణాన్ని ప్రభుత్వం సృష్టించినా అంగన్‌వాడీలు తగ్గలేదు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కలెక్టరేట్ ప్రాంతాలు హోరెత్తాయి. పారిశుధ్య కార్మికులు, ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు ఎక్కడికక్కడ ఆందోళనలను కొనసాగించారు.

- ఆందోళనలతో అట్టుడికిన గుంటూరు
- కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు
- కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె
- కలెక్టరేట్ వద్ద యూటీఎఫ్ 12 గంటల నిరసన
- నగరపాలక సంస్థ వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా
- ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకుల ముందస్తు అరెస్టు



కార్యకర్తను అంబులెన్స్‌లోకి తీసుకువెళుతూ...

గుంటూరు(తూర్పు), జనవరి 3: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులు బుధవారం పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ ఆయా వర్గాలకు చెందిన వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాలు.. ప్రదర్శనలు.. నినాదాలతో గుంటూరు హోరెత్తింది. అంగన్‌వాడీలు కలెక్టరేట్‌ను ముట్టడించగా, ఉపాధ్యాయులు ధర్నా చేశారు. నగరపాలక సంస్థ వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. డిమాండ్లను నెరవేర్చేదాకా ఆందోళనలను విరమించేది లేదని స్పష్టం చేశారు. అడుగడుగునా పోలీసు ఆంక్షలతో నిర్బంధించినా కలెక్టరేట్ ముట్టడికి అంగన్‌వాడీలు కదం తొక్కారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి అంగన్‌వాడీలు గుంటూరుకు చేరుకోవడంతో రహదారులన్నీ వారితో నిండిపోయాయి. తొలుత జిల్లా కోర్టు నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వామపక్ష జిల్లా నాయకులు వై నేతాజీ, దండా లక్ష్మీనారాయణ, నళినీకాంత్, రావుల అంజిబాబు, నన్నపనేని శివాజీ, మేడా హనుమంతురావు, చిష్టీ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్ లోపలికి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు బారీకేడ్లు అడ్డంపెట్టి అంగన్‌వాడీలను నిలువరించారు. దీంతో కలెక్టరేట్ గేటు ఎదుట అంగన్‌వాడీలు బైఠాయించారు. దాదాపు నాలుగు గంటలసేపు కోలాటం, పాటలు పాడుతూ నిరసన తెలిపారు. మాట ఇచ్చిన జగనన్న -మోసం చేసిన జగనన్న, ఇదేమి రాజ్యం-దొంగల రాజ్యం, అంగన్‌వాడీల సత్తా చూపిద్దాం, అంగన్‌వాడీల నిర్బంధం సిగ్గు చేటు.. అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. మధ్యాహ్నం భోజనం చేయవద్దని పోలీసులు అంగన్‌వాడీలను అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. నిరసనలో పాల్గొన్న బాజీబీ అనే అంగన్‌వాడీ స్పృహ కోల్పోవడంతో అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. అంతకుముందు అంగన్‌వాడీలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో అంగన్‌వాడీలు నగరంపాలెం ఎదుట బైఠాయించి కొద్దిసేపు నిరసన తెలిపారు.

5 నుంచి విధులకు హాజరవ్వాలి : జేసీ రాజకుమారి

కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల నుంచి జేసీ రాజకుమారికి వినతిపత్రాన్ని స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను దాదాపుగా పరిష్కరించామని, కీలకమైన శాఖలో పనిచేస్తున్న వారు నిరసనలో పాల్గొనడం బాధాకరమన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఈ నెల 5 నుంచి విధులకు హాజరవ్వాలని వారికి తెలిపారు. దీనిపై అంగన్‌వాడీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. హామీలను నెరవేర్చమని ఉన్నతాధికారులు చెప్పడం పూర్తి అవాస్తవమన్నారు. అధికారుల బెదిరింపులకు భయపడమని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు దీప్తి మనోజ స్పష్టం చేశారు. సమస్యలను పరిష్కరించేవరకు సమ్మెలోనే ఉంటామని తెలిపారు.



జేసీ రాజకుమారికి వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

15వ రోజుకు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె



నిరసనల్లో పాల్గొన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

గుంటూరు(తూర్పు): విద్యాశాఖలో విలీనం చేసి సమానపనికి సమాన వేతనం ఇస్తామని పాద యాత్రలో జగన్‌మోహనరెడ్డి ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్షా ఉద్యో గులు చేస్తున్న సమ్మె బుధవారంతో 15వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా కాం ట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె కొనసాగింది. ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కె.మా .దవికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్య క్రమంలో సమగ్రశిక్షా ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్, అబ్దుల్ రెహమాన్, మహిళా కార్యదర్శులు శివపార్వతి, శ్రీదేవి, నాయకులు గంగయ్య, కిరణ్, రాధా, జ్యోతి, చలపతి, సతీష్, సుభాని, వినోద్, చంద్ర, మాధురి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు

పన్నులు.. జీతాలు.. ఖర్చులు చెప్పాలి

గుంటూరు(విద్య): ప్రజలు చెల్లిస్తున్న పన్నులు.. ఉద్యోగులకు చెల్లిస్తున్న జీతాలు.. ప్రజాప్రతినిధుల కోసం వెచ్చిస్తున్న ఖర్చుల వివరాలను ప్రజలకు తెలియచేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. 12 గంటల ధర్నాలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి బాగుందని సాక్షాత్తు ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటన చేశారని, కానీ ఆర్థిక శాఖ అధికారులు అస్తవ్యస్తంగా ఉందంటున్నారని, ఏది వాస్తవమో చెప్పడానికి శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు ధర్నాలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీ ఆదిలక్ష్మి, ఎం కళాధర్, ఎం హనుమంతరావు, జీ వెంకటేశ్వర్లు, ఏఎల్ శివపార్వతి, ఎండీ గ యా సుద్దొలా తదితరులు పాల్గొన్నారు.

జీఎంసీ ఎదుట నిరసన హోరు

గుంటూరు(కార్పొరేషన్): ర్యాలీలు.. ధర్నాలు.. ఆందోళనలతో జీఎంసీ హోరెత్తిపోయింది. పారిశుధ్య కార్మికులు, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ జీఎంసీ ఎదుట ధర్నా చేశారు. కార్మికుల డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ జనసేన నాయకులు బీఆర్ స్టేడియం నుంచి జీఎంసీ వరకు ర్యాలీ చేపట్టారు. జీఎంసీ నుంచి టీబీ బంగ్లా వరకు ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ చేపట్టారు. డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని పలు కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. జీఎంసీ ఎదుట జనసేన నాయకుడు ఆళ్ల హరిబాబు తదితరులు అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులను ముందస్తుగా పోలీసులు అదుపులో తీసుకోవడంతో కార్మికులు మాత్రమే రోడ్డెక్కారు.



కార్పొరేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, పారిశుధ్య కార్మికులు.



రోడ్డుపై అర్ధ నగ్న ప్రదర్శన చేస్తున్న జనసేన నాయకులు



సమ్మెలో పాల్గొన్న ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ శానిటేషన్ ట్రేడ్ యూనియన్ నాయకులు.



రోడ్డుకు అడ్డంగా పెట్టిన వాహనాలు

సీసీఐలో మిల్లర్ల చేతివాటం

- తడిసిందన్న సాకుతో కోతపై రైతుల కన్నెర్ర
- క్వింటాకు 10 కేజీల మినహాయింపుపై ఆగ్రహం
- గుంటూరు-పర్చూరు రహదారిపై రైతుల రాస్తారోకో

గుంటూరు సిటీ, జనవరి 3: వర్షానికి పత్తి తడిసింది.. క్వింటాకు 10 కేజీలు చొప్పున తరుగు కింద మినహాయిస్తాం.. అని సీసీఐ పత్తి కొనుగోళ్లలో మిల్లర్ల చేతివాటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల మిల్లర్లే బయ్యర్ల పాత్ర పోషిస్తుండటం వివాదాస్పదంగా మారింది. గుంటూరు 5 మైలు సమీపంలోని సీసీఐ కేంద్రం వద్ద బుధవారం రైతులు ఆందోళనకు దిగారు. తాడికొండ మండలం పొన్నెకల్లుకు చెందిన రైతులు బుధవారం పత్తిని తీసుకుని కేంద్రానికి వచ్చారు. అయితే సాయంత్రం వరకు బతిమిలాడినా పత్తి కొనుగోలుకు అక్కడున్న వారు ససేమిరా అన్నారు. బయ్యర్ తరఫున వచ్చిన వాళ్లు కొనుగోలు చేయమని చేతులు ఎత్తేశారు. దీంతో మిల్లర్ రంగంలోకి దిగి క్వింటాకు 10 కేజీల చొప్పున తగ్గించి కొనుగోలు చేస్తామని చెప్పగా రైతులు అంగీకరించలేదు. అవసరమైతే ధరలో రూ.100 తగ్గించమని చెప్పారు. తాము చెప్పినదానికి అంగీకరించనందున పత్తిని కొనుగోలు చేయమని మిల్లర్లు చెప్పడంతో వివాదం నెలకొంది. పత్తిని కొను గోలు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తూ రైతులు గుంటూరు-పర్చూరు రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టి ధర్నా చేయడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా రైతులకు, ప్రయాణికులకు మధ్య కొంత వాగ్వాదం జరిగింది. 108 అంబులెన్స్ రావడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

అన్ని చోట్ల అంతే

గతేడాది నవంబరు నుంచే సీసీఐ పత్తి కొనుగోలుకు కేంద్రాలను తెరిచింది. గుంటూరులో తాడికొండ, మైలవరం, జగ్గయ్యపేట, ప్రత్తిపాడు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఈ కేంద్రాలకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి అధిక మొత్తంలో పత్తిని తీసుకు వచ్చారు. కొన్ని చోట్ల కొను గోలు బాగా జరుగుతున్నా, మరికొన్ని చోట్ల మాత్రం ప్రైవేటు వ్యక్తుల జోక్యంతో వివాదాస్పదమవుతుంది. మొదట్లో కొన్ని కేంద్రాల్లో క్వింటాకు 3 కేజీల వరకు తరుగు తీసినట్లు ఆరోపణ లు వచ్చాయి. అప్పట్లో సీసీ ఐ అధికారులు అప్రమత్తం కావడంతో రైతులకు కొంత మేలు జరిగింది. తుఫాను తర్వాత పత్తి కొనుగోళ్లలో పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల జోక్యం పెరిగి నాణ్యత లేదన్న సాకుతో క్వింటాకు 10 కేజీల వరకు తరుగు తీస్తున్నారు. తరుగుకు రైతు ఒప్పుకోక పోతే పంటను కొనుగోలు చేయడం లేదు. చాలామంది రైతులు ఏమీ చేయలేక ఎంతో కొంతకి అమ్ముకునిపోయారు. ప్రత్తిపాడు కేంద్రంలో క్వింటాకు రూ.150 నుంచి రూ.200 వరకు ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వాల్సి వస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. తుఫాను తర్వాత సీసీఐ కనీస మద్దతు ధరను రూ.7020 నుంచి రూ.6670కి తగ్గించింది. ఈ ధరకు విక్రయించేందుకు సిద్ధమైనా మరింత కోతలు పెట్టడంపై రైతులు మండిపడుతున్నారు. కొన్ని కేంద్రాల్లో రైతుల కన్నా ఎక్కువగా వ్యాపారులే అమ్మకాలకు వస్తున్నారు. ఈ-క్రాప్ నిబంధన ఉన్నా సచివాలయంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్లను మచ్చిక చేసుకుని పేర్లు నమోదు చేయిస్తున్నారని ఆరోపణలున్నాయి.

మిగిలేది ఏమీ లేదు..



ఆరుగాలం పండించి తెచ్చిన పంటను కొనడానికి నానా ఇబ్బందులు పెడుతున్నారు. నేను 10 ఎకరాల్లో పత్తి వేశా. ఇక్కడకు వచ్చాక క్వింటాకు 10 కేజీల తరు గంటే మాకు మిగిలేది ఏమీ ఉండదు.

- ముప్పాళ్ళ సాంబశివరావు, పొన్నెకల్లు

క్వింటాకు రూ.2 వేలు ఖర్చు



పత్తి తీయడానికి క్వింటాకు రూ.2 వేలు ఖర్చు అవుతుంది. తుఫాను వల్ల నష్టపోయాం. ఇప్పుడు పత్తి కొనుగోలుకు నానా ఇబ్బందులు పెడుతున్నారు. రైతులను దోచుకుంటున్నారు.

- అన్నే నాగేశ్వరరావు, పొన్నెకల్లు

మన చేనేతకు.. జాతీయ అవార్డు

- ఢిల్లీలో కేంద్ర మంత్రి నుంచి అందుకున్న కలెక్టర్



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి చేనేత చీరలు, ఫ్యాబ్రిక్స్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మకమైన వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్ జాతీయ స్పెషల్ మెన్షన్ అవార్డును జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి న్యూఢిల్లీలో అందుకున్నారు. బుధవారం మధ్యాహ్నం న్యూఢిల్లీలోని ప్రగతి మైదానంలో కేంద్ర ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డా. ఎస్ జయశంకర్, మరోమంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా కలెక్టర్ అవార్డును తీసుకున్నారు. దేశ వ్యాప్తంగా 580 జిల్లాలు అవార్డులకు ఎంట్రీలు దాఖలు చేయగా, ప్రాథమిక స్థాయిలో 60 జిల్లాలను ఎంపిక చేశారు. వీటిలో తుది జాబితాలో టాప్ 10 జిల్లాలను ఎంపిక చేయగా గుంటూరు జిల్లా మంగళగిరి చేనేత చీరలు, ఫ్యాబ్రిక్స్ ఉత్పత్తులకు స్థానం దక్కింది. మంగళగిరిలో చేనేత పరిశ్రమను ప్రోత్సహించటానికి కేంద్ర ప్రభుత్వ హ్యాండ్లూమ్స్ క్లస్టర్ డెవలప్‌మెంట్ పథకం, మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త నిధులతో 197 వ్యక్తిగత మగ్గం షెడ్ల నిర్మాణానికి జిల్లా యంత్రాంగం కావలసిన భూమిని గుర్తించి, అత్యంత వేగంగా నిర్మాణాలను పూర్తి చేయటం జరిగింది. అదే విధంగా చేనేత కార్మికులకు వృత్తి విద్యా నైపుణ్యాల పెంపుదల, ఆధునిక డిజైన్ల వస్త్రాల తయారీ కోసం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్స్(ఎన్ఐడీ), నేషనల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్స్ (ఎన్ఐఎఫ్‌డీ)తో ఒప్పందం చేసుకొని శిక్షణ అందించింది. చేనేత వస్త్రాలకు అవసరమైన ముడి సరుకును 15 శాతం రాయితీతో చేనేత జౌళిశాఖ ద్వారా సరఫరా చేయటం జరుగుతున్నది. మంగళగిరి చేనేత వస్త్రాల అమ్మకాల కోసం గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేయటంతో పాటు, ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమంలో కూడ వస్త్రాల విక్రయాల కౌంటర్ ఏర్పాటు చేసి విస్తృతస్థాయిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించటానికి కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చర్యలు తీసుకున్నారు. వీటి అన్నింటిని పరిగణలోకి తీసుకొని చేనేత పరిశ్రమకు జిల్లా యంత్రాంగం అందిస్తున్న ప్రోత్సాహానికి జాతీయ స్థాయిలో వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్ అవార్డును అందించటం జరిగింది.

అవార్డు తో మంగళగిరి చేనేత వస్త్రాలకు జాతీయ స్థాయి గుర్తింపు : కలెక్టర్

అత్యంత నాణ్యతకు, సంస్కృతి సంప్రదాయలకు చిహ్నమైన మంగళగిరి చేనేత వస్త్రాలకు కేంద్ర ప్రభుత్వం వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్ జాతీయ స్థాయి అవార్డు అందించటం ద్వారా జాతీయస్థాయిలో సముచిత గుర్తింపు ఇచ్చినట్లు భావిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి న్యూఢిల్లీ నుంచి తెలిపారు. ఇదే స్ఫూర్తితో చేనేత వృత్తిపై ఆధారపడిన యువత మరింత ప్రోత్సాహంతో మంగళగిరి చేనేత, వస్త్రాలను ముందుకు తీసుకు వెళతారని భావిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మంగళగిరి చేనేత వస్త్ర పరిశ్రమను మరింత అభివృద్ధికి కృషి చేయటం జరుగుతుందని, జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.



ఏసీబీ వలలో విద్యుత్ ఏఈ, లైన్‌మెన్

- 45 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

స్వప్రయోజనాల కోసమే మూడు రాజధానులు

- రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం
- 1478వ రోజుకు అమరావతి రైతుల ఆందోళనలు

6లో..


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

వైసీపీ పతనం ప్రారంభ మైంది

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 3 : రాష్ట్రంలో వైసీపీ పతనం ప్రారంభమైందని, ఇక జగన్‌రెడ్డి ఎన్ని కుతంత్రాలు పన్నినా ఆ పార్టీ ఎన్నికల్లో తిరిగి గెలిచే అవకాశం లేదని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టంచేశారు. బుధవారం చిలకలూరిపేట పట్టణంలోని 6వ వార్డులో స్థానిక టీడీపీ శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ.. బీటలు వారిన వైసీపీ సౌధం ఏ క్షణమైనా కుప్పకూలి పోవచ్చని, నివురుగప్పిన నిప్పులా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను దారి మళ్ళించటానికి సీఎం జగన్‌రెడ్డి సిట్టింగ్‌లను మారుస్తూ హైడ్రామా నడిపిస్తున్నాడని, ఆయనేంచేసినా ప్రజలు మళ్ళీ వైసీపీని, జగన్‌ను నమ్మి ఓట్లేసే పరిస్థితి లేదన్నారు. వార్డుల వారి సమీక్షలో భాగంగా తొలి రోజు 2, 3, 6, 7, 8 వార్డు నాయకులతో మాట్లాడి వార్డులోని ప్రధాన సమస్యలను తెలుసుకున్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, ఓటర్ల జాబితా పరిశీలన, పార్టీ కార్యక్రమాల నిర్వాహణ, నాయకుల పనితీరుపై చర్చించారు. రాష్ట్రంలో ఎన్నికలకు ఎంతో సమయం లేదని, పార్టీ నాయకులు, కార్యకర్తలు రానున్న మూడు నెలల్లో దూకుడుగా పని చేయాలని ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు.

వైసీపీ కార్యాలయంపై రాళ్లదాడి కేసులో

మరో 9 మంది అరెస్ట్ .. విడుదల

గుంటూరు,జనవరి 3: గుంటూరు నగరంలోని లక్ష్మీపురం సాయిబాబారోడ్డు సెంటర్‌లో డిసెంబరు 31 అర్ధరాత్రి వైసీపీ కార్యాలయంపై రాళ్ళు రువ్విన కేసులో మరో 9 మందిని బుధవారం పట్టాభిపురం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో ఇప్పటికే సుమారు 25 మందిని సోమవారం అరెస్ట్ చేసిన విషయం విదితమే. తాజాగా మరోమ 9 మందిని అరెస్ట్ చేసి వారిని బెయిల్ పై విడుదల చేశారు. కేవలం ఒకరిద్దరు మాత్రమే రాళ్ళువిసిరితే సంబంధం లేని ఎంతో మందిని అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, బాధితుల కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.



ఉద్యోగావకాశాలు

⇒ ప్రముఖ MNC కంపెనీలో Consultant గా పని చేయుటకు 10వ తరగతి పాసైన, గృహిణులు, రిటైర్డ్ ఉద్యోగులు పార్ట్ టైం, అభ్యర్థులు కావలెను. వయస్సు : 30 నుండి 65 సం.లు. సంప్ర॥ 9848647051, 90591 50774. AJG-166878

⇒ గుంటూరు సిటీలోని మా ఆఫీస్ నందు పనిచేయుటకు Tally, Accounts, Excel లో అనుభవం కలిగిన వారు కావలెను. లేడీస్‌కి ప్రాముఖ్యము ఇవ్వబడును. Contact No : 91003 47592 AJG-166891

⇒ గుంటూరులోని ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీలో ఆఫీసు మరియు సిస్టమ్ వర్క్ చేయుటకు ఇంటర్ ఉత్తీర్ణత కలిగిన వివాహిత మహిళలు కావలెను. సెల్ : 90309 93895 AJB-1290

⇒ ఒమేగా హాస్పిటల్ హైదరాబాద్ నందు వృద్ధులను/పేషంట్లను / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం:20K. ఫోన్:8977639662, 8977639663. AJH-13253

రియల్ ఎస్టేట్

⇒ Happy New Year. గుంటూరు జిల్లాలో శ్రీభ్రమరాంబపురం కాలనీ UDA అప్రూవ్డ్ ప్లాట్స్ & జనచైతన్య వెంచర్‌లో ఉన్న ప్లాట్స్ అ/కొ. సంప్ర॥ 9848986831. మీ మన్నెం లతీష్ గౌడ్. SJAA-331

⇒ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ముఖద్వారమైన తాడికొండ ఊరు అనుకొని APCRDA అప్రూవల్‌తో స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కలవు. సంప్ర॥ 99591 27008. AJG-166886

⇒ గుంటూరు సిటీ, గొర్లవారిపాలెం, అమరావతి రోడ్డు, లాం, పరిధిలోని గృహనిర్మాణానికి అనువుగల CRDA అప్రూవల్ ప్లాట్స్ అమ్మకానికి కలవు. లోన్ సదుపాయం కలదు. సంప్ర : 99123 42199 AJB-1669

⇒ గుంటూరు నుంచి అమరావతి వెళ్ళే దారిలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రక్కన నివాసయోగ్యమైన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కలవు. సంప్ర॥ 99591 27008. AJG-166885

PLOT FOR SALE

⇒ రాజధాని అమరావతి సమీపంలో తాడికొండ అడ్డరోడ్ దగ్గర CRDA అనుమతి కలిగిన కొత్త వెంచర్‌లో ప్లాట్స్ కలవు. సంప్ర॥ 99493 42563. LA-3110

SPOKEN ENGLISH

⇒ ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు : సులభంగా మాట్లాడండి. 5 రోజులు ఆఫ్ / ఆన్‌లైన్ క్లాసులు వాట్సాప్ ద్వారా రేపటి నుండి హాజరుకండి. ప్రామాణిక, 10/4, అరండల్‌పేట, మాలకొండయ్య కాలనీ, గుంటూరు. సెల్: 94405 39029. AJG-166892

పోయినవి

⇒ చెరువు కనకదుర్గ W/o లేటు రామకృష్ణ శాస్త్రి, జెండా చెట్టు దగ్గర, బ్రాడీపేట, 6/21 గుంటూరుకి చెందిన సేల్ డీడ్ నం. 321/1992, ఒరిజినల్ రిజిస్టర్ డాక్యుమెంట్, జిరాక్స్ కోసం ఇంటి నుంచి పట్టాభిపురం ప్రయాణిస్తున్నప్పుడు, దారిలో పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. దొరికిన వారు పై అడ్రస్‌కు పంపగలరు. 7674077515 AJG-166890

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

⇒ బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999 AJB-181853

అద్దెకు

⇒ తెనాలి బుర్రిపాలెం రోడ్డులో గుప్తాకాలేజీ వద్ద ఎకరం విస్తీర్ణంలో నెలకొల్పబడిన మనోప్రకాష్ మానసిక చికిత్సలయం మొత్తంగా గాని / విడివిడిగా గాని అమ్మకము / అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 9440220551, 8500514024 AJG-152088

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)


పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!



ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు: బ్రాంచ్ మేనేజర్

గుంటూరు 1 టౌన్	- 97036 18725
గుంటూరు 2 టౌన్	- 99854 01056
తెనాలి	- 99854 11202
నరసరావుపేట	- 99854 11206
బాపట్ల	- 99663 35084
పిడుగురాళ్ళ	- 93909 05725
మంగళగిరి	- 93986 73618
అమరావతి	- 95027 86195
పొన్నూరు	- 97042 99094
రేపల్లె	- 99854 12254
చిలకలూరిపేట	- 99639 84109
వినుకొండ	- 99662 50266
మాచర్ల	- 88861 19952
సత్తెనపల్లి	- 91103 23914
ప్రత్తిపాడు	- 63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

గురుకుల విద్యాలయ సొసైటీలో

ఆయనో మోనార్క్!


గుంటూరు కొరిటెపాడులోని గురుకుల సొసైటీ కార్యాలయం

● తాను చెప్పిందే వినాలి.. ఇతరుల సలహాలు పట్టించుకోరు.
● గురుకులాల్లో అంతర్గత సమస్యలపై ప్రిన్సిపాళ్ల గోడు

గుంటూరు(విద్య),జనవరి 3: గురుకుల విద్యాలయ సొసైటీలో అంతర్గత సమస్యలు విద్యార్థులకు శాపాలుగా మారుతున్నాయి. ప్రిన్సిపాళ్లు చేసిన అనేకప్రతిపాదనలు అధికారుల నిర్లక్ష్యంతో ఆమోదానికి నోచుకోవడంలేదు. దీంతో కనీసం నిర్వహణ ఖర్చులు చెల్లించ లేని పరిస్థితి ఏర్పడిందని ప్రిన్సిపాళ్లు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల వైద్య పరీక్షలకు గతి లేదు..

విద్యార్థులకు నెలకు ఒకసారి నిర్వహించే వైద్య పరీక్షలను కొంతకాలంగా చేయిండటంలేదని, కనీసం పీహెచ్‌సీ స్థాయి వైద్యుల చేతనైనా వైద్యపరీక్షలు నిర్వహించాలని తాము చేసిన విజ్ఞప్తిని సొసైటీలోని ఆ అధికారి పెడచెవిన పెడుతున్నారని ప్రిన్సిపాళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే లయన్స్‌క్లబ్, రోటరీ తదితర స్వచ్ఛంద సంస్థల వితరణ కార్యక్రమాలను సైతం అడ్డుకుంటున్నాడని ప్రిన్సిపాళ్లు వాపోయాతున్నారు. కనీసం విద్యాలయాల్లో ట్యూబ్‌లైట్లు, మోటార్ రిపేరు, అత్యవసరమైన భవనాల మరమ్మతుల గురించి ప్రిన్సిపాళ్లు ఎన్నిసార్లు ప్రతిపాదనలు చేసినా స్పందించడం లేదు. సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే సమీక్షలు కూడా రహస్యంగా నిర్వహిస్తారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇటీవల గుంటూరు నగరంలో గురుకుల విద్యాయాల సొసైటీ ఆధ్వర్యంలో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రిన్సిపాళ్లకు సత్కార సభ నిర్వహించారు. ఈసమావేశంలో ఓ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. 'ఆంధ్రజ్యోతిలో గురుకుల ఘోష'శీర్షికతో వచ్చిన కథనంపై చర్చ పెట్టారు. ఈ సందర్భంగా పత్రికలకు ఓ లేఖ ఇచ్చారని సిబ్బందిపై సదరు అధికారి అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. ఈ సంఘటనను మరో ప్రిన్సిపాల్ సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తున్న ఈ విషయం గమనించిన ఆయన హుటాహుటిన ఆ ప్రిన్సిపాల్ వద్దకు వచ్చి ఆయన సెల్ లాక్కుని నెలకేసి కొట్టారు. 'ఏంటీ తమాషాగా ఉందా?' అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

గురుకులాలు అద్భుతంగా ఉన్నాయంటూ సొంత కితాబు..

గురుకులాలు అన్ని అద్భుతంగా ఉన్నాయని, ప్రిన్సిపాళ్లు సిబ్బంది సమస్యలు సృష్టిస్తున్నారని సదరు అధికారి కితాబు ఇవ్వడంతో పాటు ప్రిన్సిపాళ్లపై తీవ్రస్థాయిలో అగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో అ అధికారి ఏ విద్యాలయ పర్యటనలకు వెళ్ళిన దాఖలాలు దాదాపు లేవు. ఆ అధికారి ఏవరి మాటవినిపించుకోరు. చుట్టూ ఉన్న కోటరీలోని వ్యక్తుల మాట తప్పించి ఏవరి మాట వినరు అనే ప్రచారం సాగుతోంది. దీర్ఘకాలంగా పనిచేసే ఓ ద్వితీయశ్రేణి అధికారి చెప్పిందే వేదంగా భావిస్తారని సమాచారం. వాస్తంగా కార్యాలయాన్ని సచివాలయ సమీపానికి తరలించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇక్కడ అద్దె భవనంలోనే లక్షలు చెల్లిస్తూ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడికి రావాలంటే ప్రిన్సిపాళ్లకు, ఇతర సిబ్బందికి అనదపు భారం తప్పడం లేదు. రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులు సర్వీస్ విషయాల్లో ముడుపులు ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఉందని ఆరోపణల ఉన్నాయి.

పేద,బడగు బలహీనవర్గాల విద్యా ఉన్నతికి పాటు పడాల్సిన గురుకుల విద్యాలయాలు ఒకవైపు ప్రభుత్వ నిర్లక్ష్యంతో అస్తవ్యస్తంగా మారుతుంటే మరోవైపు ఉన్నత స్థాయిలో అధికారులు సమస్యల్ని మరింత జటిలం చేస్తున్నారు. గురుకుల విద్యాలయాల్లో పరిపాలనా పరమైన సమస్యల్ని పట్టించుకోకుండా తమ సొంత ఎజెండా అమలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

సిటీ, ఎమ్మారై స్కాన్ యంత్రాలుకు సుస్తీ

● రోగులకు తప్పని అవస్థలు
● వ్యయ ప్రయాసలకోరి బయట సెంటర్‌లకు వెళుతున్న వైనం



ఎమ్మారైస్కాన్ పనిచేయకపోవడంతో గదులకు తాళాలు వేసి ఉన్న దృశ్యం

తెనాలిరూరల్, జనవరి 3: జిల్లాలోనే అతి పెద్ద రెండవ వైద్యశాలగా సేవలందిస్తున్న తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో రోగులకు వ్యాధి నిర్ధారణ చేసే సిటీస్కాన్, ఎమ్మారై వంటి పరికరాలు మొరాయించాయి. గత రెండేళ్లుగా సిటీస్కానర్ మరమ్మతులకు నోచుకోకపోగా తాజాగా ఎమ్మారై స్కాన్ కూడా మొరాయించింది. దీంతో అనారోగ్య సమస్యలతో వైద్యశాలకు వచ్చే రోగులకు వ్యాధి నిర్ధారణ చేసేందుకు అవసరమైన పరీక్షలు అందుబాటులో ఉండటం లేదు. తెనాలిలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తెనాలి, దుగ్గిరాలు, కొల్లిపర, కొల్లూరు, చుండూరు, చేబ్రోలు, వేమూరు, అమర్తలూరు మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వైద్యసేవలకు వస్తుంటారు. ఇవే కాకుండా యాక్సిడెంట్, పాయిజన్ తీసుకున్న అత్యవసర కేసులు తరచుగా వస్తుంటాయి. అలాగే ఆర్థో విభాగంలోని రోగుల వ్యాధి నిర్ధారణ, శస్త్రచికిత్సల సందర్భంలో సిటీ స్కాన్, ఎమ్మారై స్కాన్‌ల అవసరం ఉంటుంది. ఐతే ఆస్పత్రిలో ఎమ్మారై, సిటీ స్కాన్ యంత్రాలు రెండు అందోబాటులో లేకపోవడంతో రోగులు బయటకు వెళ్లి చేయించుకోవల్సి వస్తుంది. కాగా ఈ పరీక్షలు ఎంతో ఖర్చుతో కూడుకున్నవి. అత్యవసర వైద్యం కోసం వచ్చే వారు ఆసుపత్రి నుంచి స్కానింగ్ సెంటర్లకు తరలించడం సాధ్యం కాకపోవడం, పైగా ఆయా స్కాన్ లకు ఖర్చు భరించలేక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసుపత్రి ఉన్నతాధికారులు వైద్యశాల్లోని రోగులకు సిటీ స్కాన్, ఎమ్మారై స్కాన్‌ల వంటి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి రోగులకు నాణ్యమైన వైద్యం అందించేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.


ఏసీబీ వలలో విద్యుత్ ఏఈ, లైన్‌మెన్

● రూ.45 వేలు లంచం తీసుకుంటూ చిక్కిన వైనం


అవినీతి అధికారులను పట్టించిన రైతు

రాజుపాలెం, జనవరి 3: ఓ రైతు పొలానికి విద్యుత్ కనెక్షన్ విషయంలో లండం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖలోని ఏఈ, ఓ ప్రైవేట్ లైన్‌మెన్‌ను బుధవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతు సరికొండ వెంకటేశ్వర రాజు చుట్టు ప్రక్కల పొలాలకు చెందిన రైతులతో కలసి తన పొలంలో నూతన విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కనెక్షన్ మంజూరు చేయాలంటే రూ.50 వేలు నగదు ఇవ్వాలని విద్యుత్‌శాఖ అధికారులు డిమాండ్ చేశారు. తాము అంతమొత్తంలో ఇవ్వలేమని చెప్పినప్పటికీ వారు ఒప్పుకోలేదు. దీంతో బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు బుధవారం రంగంలోకిదిగి పథకం ప్రకారం సత్తెనపల్లి నుండి వస్తున్న విద్యుత్ శాఖ ఏఈ విజ్ఞాన ప్రసాద్, ప్రైవేటు లైన్‌మెన్ నూర్‌బాషా ఆదంషఫీలను రెడ్డిగూడెంలో లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. వారిని రాజుపాలెంలోని విద్యుత్ శాఖ కార్యాలయానికి తీసుకువచ్చి విచారిస్తున్నారు. దాడుల్లో అడిషనల్ ఎస్పీ మహేంద్రమత్తె, డీఎస్పీ ప్రతాప్ సత్యానంద్, సీఐలు రవిబాబు, నరసింహారెడ్డి, అంజిబాబు, మన్మథరావు, సురేష్, నాగరాజు, ఎస్ఐ శ్రీనివాస్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య


కౌలు రైతు యానాదిరావు (ఫైల్)

వేమూరు, జనవరి 3 : అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చావలి గ్రామంలో జరిగింది. గోపాలం యానాదిరావు అనే కౌలు రైతు 10 సంవత్సరాల నుంచి 7 ఎకరాల భూమిని కౌలుకు చేస్తూ ఉన్నాడు. వ్యవసాయ పెట్టుబడుల కోసం గతంలో రూ.10 లక్షల దాకా ఖర్చు చేసి నష్టపోయాడు. ఈ ఏడాది సాగుచేసినప్పటికీ ఇటీవల సంభవించిన తుఫానుకు చేతికి అంది వచ్చిన పంట పూర్తిగా దెబ్బతింది. పెరిగిన అప్పుల భారంతో మనోవేదనకు గురైన యానాదిరావు మంగళవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీనిపై వేమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6న గుంటూరుకు ఉదయ్ ఎక్స్‌ప్రెస్

● అదేరోజు అమరావతి ఎక్స్‌ప్రెస్ నరసపూర్ వరకు పొడిగింపు
● జెండా ఊపి ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
● గుంటూరు రైల్వేస్టేషన్‌లో వీడియో లింకు ద్వారా ఏర్పాట్లు
● జీఎం నుంచి డీఆర్ఎంకు ఆదేశాల జారీ

గుంటూరు, జనవరి3 (ఆంధ్రజ్యోతి): ఎన్నాళ్లగో ఎదురు చూస్తున్న విశాఖపట్టణం - గుంటూరు - విశాఖపట్టణం ఉదయ్ ఏసీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6వ తేదీన గుంటూరు నుంచి రాకపోకలు సాగించనుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ నుంచి గుంటూరు డీఆర్ఎంకు ఆదేశాలు జారీ అయ్యాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శనివారం ఉదయం నరసపూర్ రైల్వేస్టేషన్‌లో ఈ రైలుని వీడియో రిమోట్ లింకు ద్వారా ప్రారంభిస్తారు. ఆ కార్యక్రమానికి సంబంధించి గుంటూరు రైల్వేస్టేషన్‌లో వీక్షించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో గుంటూరు జిల్లా ప్రయాణికులకు కొత్తగా ఏసీ డబుల్ డెక్కర్ లాంటి రైలు నిత్యం విశాఖ పట్టణానికి అందుబాటులోకి రానుంది.

ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ని తొలుత విశాఖపట్టణం-విజయవాడ- విశాఖ పట్టణం మధ్యన నడిపేందుకు ఏర్పాటుచేశారు. ఆరైలుని గుంటూరు వరకు పొడిగించాలని ఎంపీలు గల్లా జయదేవ్, లావు శ్రీకృష్ణదేవ రాయలు, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మోపిదేవి వెంకట రమణలు పలుమార్లు రైల్వేబోర్డు, దక్షిణ మధ్య రైల్వే జీఎంకి విజ్ఞప్తి చేశారు. దాంతో ఏడాది క్రితమే ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ని గుంటూరుకు పొడిగిస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకోగా సాంకేతిక కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎట్టకేలకు ముహూర్తాన్ని ఖరారు చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమయం ఇవ్వడంతో ఈ నెల 6వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీని వలన ఉదయం విశాఖపట్టణం నుంచి గుంటూరుకు, సాయంత్రం గుంటూరు నుంచి విశాఖపట్టణానికి కొత్తరైలు అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం గుంటూరు మీదగా నిత్యం రాత్రి వేళ విజయ వాడ - హుబ్లీ మధ్యన రాకపోకలు సాగిస్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్‌ని నరసపూర్ వరకు పొడిగించారు. పొడిగింపు కారణంగా ఈ రైలు వేగాన్ని కూడా పెంచారు. ప్రస్తుతం హుబ్లీ నుంచి గుంటూరుకు చేరుకొంటున్న సమయాన్ని దాదాపుగా గంట తగ్గించారు. ఈ రైలు ఉదయం 7.30 గంటలకు నరసపూర్ చేరుకొనేలా టైంటేబుల్ రూపొందించారు. నరసపూర్ నుంచి హుబ్లీకి వచ్చే రైలు విజయవాడ నుంచి పాత సమయపట్టికలోనే ప్రయాణిస్తుంది. ఈ రైలు వలన నరసపూర్‌కు చేరుకోవడానికి అదనపు సౌకర్యం ప్రయాణీకులకు అందుబాటులోకి వస్తుంది.

సమన్వయకర్తకూ.. సలాం

● నూతన సంవత్సరం రోజున వైసీపీ కార్యాలయానికి క్యూ కట్టిన పోలీసు శాఖ
● ఆ పార్టీ నేతలతో కలసి వేడుకల్లో పాల్గొన్న అధికారులు
● వైసీపీ సమన్వయకర్తతో కలసి కేక్ కటింగ్ ...


వైసీపీ కార్యాలయంలో బలసాని కిరణ్ కుమార్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ, ప్రత్తిపాడు, నల్లపాడు సీఐలు, ఎస్ఐలు

ప్రత్తిపాడు, జనవరి 3: ఆయన ఎమ్మెల్యే కాదు.. మంత్రి కాదు.. అధికారికంగా ఎలాంటి పదవులు లేవు.. కేవలం ఒక రాజకీయ పార్టీ తరుపున ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త మాత్రమే. ఏ పదవి, హోదా లేని వ్యక్తికి నియోజకవర్గ పోలీస్ డిపార్ట్‌మెంట్ అధికారులంతా సలాం చేశారు. ఏకంగా పార్టీ కార్యాలయానికి అధికారికంగా వెళ్లి పుష్పగుచ్చాలు ఇచ్చి తమ స్వామి భక్తిని చాటుకున్నారు. డీఎస్పీ నుండి ఎస్ఐల వరకు అందరూ క్యూ కట్టారంటే ఈయన స్థాయి ఏమిటో... అంటూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే విస్తుపోయారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి వైసీపీ సమన్వయకర్తగా బలసాని కిరణ్ నియమితులైనప్పటి నుంచి ఆయకు అన్ని శాఖల అధికారులు సలాం చేస్తూనే ఉన్నారు. తాజాగా నూతన సంవత్సరం సందర్భంగా వైసీపీ పార్టీ కార్యాలయంలో గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ, ప్రత్తిపాడు, నల్లపాడు సీఐలతో పాటు ప్రత్తిపాడు ఎస్ఐ మినహా అన్ని మండలాల ఎస్ఐలు బలసాని కిరణ్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్చం, మొక్కలు అందజేసి ఆ తరువాత కేక్ కూడా కట్ చేసి వచ్చారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఒక రాజకీయ పార్టీ తరుపున పోటీచేసే అభ్యర్థి పట్ల పోలీసు శాఖ తమ స్వామి భక్తిని చూపించడం ప్రస్తుతం చర్చాంసనీయంగా మారంది. పోలీస్ అధికారులు వైసీపీ నేత బలసాని కిరణ్ కుమార్‌ను కలిసిన ఫోటోలు సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్నాయి.


బలసానికి పుష్పగుచ్చం అందజేస్తున్న గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ


తుళ్ళూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

స్వప్రయోజనాల కోసమే మూడు రాజధానులు

● రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న వైసీపీ ప్రభుత్వం
● 1478వ రోజుకు అమరావతి రైతుల ఆందోళనలు

తుళ్ళూరు జనవరి 3: రాష్ట్ర రాజధాని అమరావతి కోసం మాత్రమే మూడు పంటలు పంటలు పండే భూమిని తాము త్యాగం చేశామని, కానీ వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట తమ జీవితాలతో చెలగాటమాడుతుందని 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు , రైతు కూలీలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1478వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడు రాజధానుల ప్రతిపాదన పాలకుల ప్రయోజనం కోసమన్నారు. ప్రభుత్వాలు మారినా.. రాష్ట్ర రాజధాని అమరావతి మారదన్నారు. కేంద్రం ప్రభుత్వం కూడా అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని పలు మార్లు స్పష్టం చేసిందన్నారు. జగన్‌రెడ్డి మూర్ఖంగా మూడు అంటూ రాష్ట్ర భవిషత్‌ని నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం తీర్పు ప్రకారం అమరావతి అభివృద్ధిని కొనాగించాలని మూడు రాజధానులకు వ్యతిరేకంగా రాజధాని ప్రాంత గ్రామాల్లో నిరసనలు తెలిపారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు.

పింఛన్లలో మోసం చేసిన జగన్

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జనవరి3: అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3 వేలు పింఛన్‌ను ప్రతి ఒక్కరికి అందిస్తామని గొప్పలు చెప్పిన జగన్ నేడు అధికారంలోకి వచ్చాక ఐదేళ్లకు రూ.3 వేల పింఛన్ ఇస్తూ పింఛన్‌దారులను జగన్ మోసం చేశాడని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 1984లో రూ.35 ఎన్టీ రామారావు పింఛన్ పథకాన్ని ప్రారంభించగా 1997లో చంద్రబాబునాయుడు రూ.75లకు పెంచార న్నారు. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో రూ. 125 పెంచి రూ.200 అందజేసిందని, ఆ తర్వాత చంద్రబాబునాయుడు రూ.1800 పెంచి రూ.2000 ఇచ్చాడని గుర్తుచేశారు. 2019 ఎన్నికలహామీలో చంద్రబాబు ఆయన సీఎం అయ్యాక మొదటి నుంచే రూ. 3 వేలు ఇస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జగన్ మోసపూరిత హామీతో ప్రతి పింఛన్‌దారుడు ఈ ఐదేళ్లలో రూ.31 వేలకుపైగా నష్టపోయాడని తెలిపారు. మరోసారి జగన్‌ను నమ్మే పరిస్థితిలో పింఛన్ దారులు, రాష్ట్ర ప్రజలు లేరన్నారు. చంద్రబాబును గెలిపించుకొని వుంటే మొదటి నెల నుండే 3 వేల రూపాయలు పింఛన్ తీసుకొని వుండేవారమని, ఇప్పుడు బాధపడి ప్రయోజనం ఏమిటంటూ పింఛన్‌దారులు మదనపడు తున్నారని యరపతినేని తెలిపారు.

ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్

డాక్టర్ గురవారెడ్డికి పితృవియోగం


అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి (ఫైల్)

హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కిమ్స్, సన్‌షైన్ ఎండీ, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ గురవారెడ్డి తండ్రి అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి (90) బుధవారం సాయంత్రం వృద్ధాప్యంతో మృతిచెందారు. 1933 లో తుమ్మల చెరువు, పల్నాడు గ్రామంలో జన్మించిన ఆయనకు రాజ్యలక్ష్మితో వివాహమైంది. కీటకాల శాస్త్రవేత్తగా పేరుగాంచారు. ఆయనకు ముగ్గురు కుమారులు గురవారెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, నర్సింహారెడ్డి. చదువుకి అంకితంగా తన మరణానంతరం తన దేహాన్ని వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలన్న తండ్రి కోరిక మేరకు ఉస్మానియా ఆస్పత్రికి మా తండ్రి దేహాన్ని ఇస్తున్నట్లు డాక్టర్ గురవారెడ్డి తెలిపారు. మా నాన్న గారే మా అందరికి ఆదర్శం. అందర్ని తారతమ్యం లేకుండా సమానంగా గౌరవించే మానవత్వాన్ని ఆయన దగ్గరనుంచే నేర్చుకున్నాం.

పిండ మార్పిడి విధానంలో

ఆవుదూడ జననం


పిండ మార్పిడి విధానం ద్వారా జన్మించిన దూడతో రైతు

క్రోసూరు, జనవరి 3 : పూర్తిస్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో పిండమార్పిడి విధానం ద్వారా మేలు రకం ఆవు దూడను ఉత్పత్తి చేయటంలో క్రోసూరు పశు వైద్యాధికారులు విజయం సాధించారు. పశు సంవర్ధక శాఖ, శ్రీ వెంకటేశ్వర పశు విద్యాలయం సంయుక్త కార్యాచరణ ద్వారా ఈపిండ మార్పిడి ప్రక్రియ అమలు చేసినట్టు స్థానిక వైద్యులు తెలిపారు. మేలురకం దూడను హసానాబాద్ గ్రామానికి చెందిన శ్రీరామ్‌శెట్టి కృష్ణకు చెందిన నాటు ఆవు గర్భంలో గత సంవత్సరం మార్చి 1 ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఆరోగ్య వంత మైన ఒంగోలు జాతి ఆవు దూడకు ఆవు జన్మనిచ్చినట్టు వారు తెలిపారు. పశు గణాభివృద్ధి సంస్థలో పని చేస్తున్న శ్రీమన్నారాయణ ఐవీఎఫ్ ద్వారా ఫల దీకరణ చెందిన పిండాన్ని అభివృద్ధి చేయటంలో ప్రధా న పాత్ర పోషించినట్టు తెలిపారు. లాంఫారంలో పని చేస్తున్న శ్రీకాంత్ సేవలు అందించారుఆవును ఎంపిక చేసి పిండాన్ని ఆవు గర్భంలోకి ప్రవేశ పెట్టడానికి స్థానికవైద్యులు సీహెచ్ మల్లయ్య కృషిచేశారు. లాం ఫారం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ముత్తారావు మార్గదర్శకం చేశారు. ఆవుదూడను ఉత్పత్తి చేయటం తాము సాధించిన విజయంగా స్థానిక పశు వైద్య బృందం తెలియజేశారు. ఈ ప్రయోగాన్ని స్థానికంగా మరికొన్ని ఆవుల్లో ప్రవేశ పెట్టి ఆవు దూడల ఉత్పత్తిని కొనసాగిస్తామని పశు వైద్యులు ఈ సందర్భంగా తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96, 104, 115
చికెన్ విత్ స్కిన్	186.00
చికెన్ స్కిన్ లెస్	196.00

57,983 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 59,321 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 57,983 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 34,701 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	10000	22000	334	14000	21000
నెంబరు. 5	10400	17500	నెంబరు. 5	10500	15000
273	12300	17500	273	12000	12000
341	10000	18700	341	11000	18500
4884	14000	15500	4884	–	–
సూపర్ 10	13000	13500	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	9000	23000	తేజ	9500	23000
బ్యాడిగి	12000	23000	బ్యాడిగి	12500	19500
దేవనూరు డీలక్స్	10000	19000	దేవనూరు డీలక్స్	14000	14000
తెల్లకాయలు	5000	14000	తెల్లకాయలు	7000	12000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



3సతీశ్02: సావిత్రిబాయి పూలేకి నివాళులు అర్పిస్తున్న శేషయ్య, టీడీపీ నేతలు

మహోన్నతమూర్తి సావిత్రిబాయి పూలే

● 193వ జయంతి సందర్భంగా బీసీ నేతల ఘన నివాళి

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయిపూలే మహిళాలోకానికి చేసిన సేవలు ఎంతో మహోన్నతమైనవని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత నిమ్మల శేషయ్య అన్నారు. సావిత్రిబాయు పూలే 193వ జయంతి సందర్భంగా గుంటూరు మార్కెట్ సెంటర్లోని పూలే విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఆయన ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళాలోకాని సావిత్రిబాయి చేసిన సేవలకు గుర్తింపుగా ఆమెను 'ది మథర్ ఆఫ్ ఇండియన్ ఫెమినిజం'గా భారత ప్రజలు గౌరవిస్తున్నారన్నారు. 19వ శతాబ్దంలో మహిళా విద్య, సాధికారతలో ఆమె కీలకపాత్ర పోషించారన్నారు. ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా, పెత్తందారుల దాడులను ఎదుర్కొని మరీ ఆమె మహిళలకు విద్యనందేలా చేశారని డాక్టర్ నిమ్మల శేషయ్య తెలిపారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి

● బీసీ, వివిధ ప్రజా సంఘాల నేతల నివాళులు

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్తగా, తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా అణగారిని వర్గాలకు సావిత్రిభాయి పూలే చేసిన సేవలు మరువలేనివని టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ కొనియాడారు. అరండల్ పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం సావిత్రిబాయి 193వ జయంతి వేడుకలు ఆయన అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, మల్లెల ఈశ్వరరావు, మారాసు మురళీకృష్ణ, వంగర ఏడుకొండలు, లక్ష్మయ్య, గొడుగు శంకర్, రామకృష్ణ, బొబ్బిలి రామారావు పాల్గొన్నారు.

గుంటూరు(తూర్పు) : స్థానిక రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి సభ నిర్వహించారు. వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కే.జయసుధ అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రోగ్రెసివ్ ఫోరం నాయకురాలు సంగిరెడ్డి వాణి పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుంటూరు(విద్య): స్థానిక వెంగళరావు నగర్‌లోని బాలికోన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు పల్నాడుజిల్లా పులిపాడుకు చెందిన జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఈపూరి పునీతకుమారి ముఖ్య అతిథిగా హాజరై సావిత్రీబాయిపూలే సేవలను విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాల ఏడీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయురాలు సావిత్రిబాయిపూలే అని అన్నారు. మరో అతిథి జే.ప్రతాపసింహాశాస్త్రి మాట్లాడుతూ మహిళల విద్యకోసం సావిత్రాబా పూలే ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం హెచ్ఎం ఉషారాణి, వై.రమ, కే.సునీత, పీ.పాప, విజయభారతి తదితరులను ఘనంగా సత్కరించారు.

గుంటూరు: నగరంలోని స్థానిక హిందూ కాలేజ్ సెంటర్ వద్ద గల మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి బీసీ బహుజన ఫ్రంట్ ప్రజా సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో తాటికొండ నరసింహారావు, నాదెండ్ల బ్రహ్మయ్య, ఉగ్గం సాంబశివరావు, జూపూడి శ్రీనివాసరావు, నల్లపు నీలాంబరం, గంటా ప్రభుదాసు, పీవీ.రమణయ్య సుధాకర్, తన్నీరు సాంబయ్య, కర్రీ నాగేశ్వరరావు, వేంపాటి విజయలక్ష్మి ఏబ్రియేల్ మాస్టర్, సముద్రాల కోటేశ్వరరావు, కొల్లూరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగిచారు.



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

12 లోపు అన్ని క్లెయిమ్‌లను పరిష్కరిస్తాం

● జాయింట్ కలెక్టర్ రాజకుమారి గణియా
● రాజకీయ పార్టీల ప్రతినిధులతో 'ఎస్ఎస్ఆర్-2024'



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న జేసీ, కమిషనర్

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం తాజాగా విడుదలచేసిన సవరించిన షెడ్యూల్‌మేరకు 2023 డిసెంబరు 9వ తేదీ వరకు వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను జనవరి 12వ లోపు సక్రమంగా విచారించి పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో ఆమె జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి కే. చంద్రశేఖరరావుతో కలసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రాజకుమారి మాట్లాడుతూ.. ఫారం-6లో ఆరు దరఖాస్తులు, ఫారం 7లో 481 దరఖాస్తులు, ఫారం-8లో 605 టెక్నికల్ అంశాలతో కూడిన దరఖాస్తులు పరిష్కరించాల్సి వుందన్నారు. తాజాగా భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు జనవరి 22న ఫైనల్ పబ్లికేషన్ చేయవలసి ఉందన్నారు. ఓటర్ల అవగాహన కోసం జిల్లాలోని 7 నియోజకవర్గ కేంద్రాల్లో 7 ఈవీఎం ప్రదర్శన ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లోనూ ఈవీఎం ప్రదర్శన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 7 ఈవీఎం మొబైల్ ప్రదర్శన వాహనాలను ఏర్పాటుచేసి క్షేత్రస్థాయిలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు నాయుడు ఓంకార్, కంచర్ల శివరామయ్య, అత్తోట జోసఫ్‌కుమార్, రాచమల్లు భాస్కరరావు, బిళ్లా సునీల్, డాక్టర్ సేవాకుమార్, ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ.రవిందరరావు, లక్ష్మీకుమారి, ఆర్డీవో శ్రీఖర్, నగరపాలక సంస్థ ఏసీ కె.లక్ష్మీ శివజ్యోతి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ శిరీష పాల్గొన్నారు.

వైసీపీకి దోచుకోవటం తప్ప అభివృద్ధి పట్టదు

● కోవెలమూడి, బోనబోయిన

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలకు రాష్ట్రం మీద పడి దోచుకు తింటం తప్ప అభివృద్ధి పట్టదని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర (నాని), జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గుంటూరు నల్లచెరువులో డివిజన్ అధ్యక్షుడు షేక్ రబ్బానీ నేతృత్వంలో బుధవారం 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి భవిష్యత్తుకు గ్యారెంటి పత్రాలను పంపిణి చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ. 1500, చదువుకునే పిల్లలకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 15వేలు, ప్రతి రైతుకు ఏడాదికి, రూ. 20వేలు, నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, ఇంటింటికి తాగునీటి కులాయి కనక్షన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా బీసీ వర్గాలపై దాడులు ఎక్కువయ్యాయని, టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల్లో చెప్పిన విధంగా అధికారంలోకి రాగానే బీసీలకు రక్షణచట్టాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముత్తినేని రాజేష్, నిమ్మల శేషయ్య, జనసేన అధ్యక్షుడు బాలకృష్ణ, మొహమ్మద్ రఫీ, అహమ్మద్, కరిముున్, కోటేశ్వరావు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



ష్యూరిటీ పత్రాలు ఇస్తున్న కవీంద్ర, బోనబోయిన, శేషయ్య, టీడీపీ నేతలు



కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ శివాజీ ఎస్‌పీఎస్‌హెచ్‌ఎస్ యాజమాన్యం

నిష్ణాతులతో విద్యాబోధన

● కలెక్టరుతో సీతారామయ్య పాఠశాల యాజమాన్యం

గుంటూరు(కార్పొరేషన్),జనవరి3: స్థానిక లక్ష్మీపురం మెయిన్ రోడ్డు లోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో(సీబీఎస్సీ) విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యనందిస్తున్నామని ఆ పాఠశాల యాజమాన్యం కలెక్టరు వేణుగోపాల్‌రెడ్డికి తెలిపింది. బుధవారం ఎంపీ శ్రీకృష్ణదేవరా యలు, మాజీ ఎంపీ డాక్టర్ ఎలమంచిలి శివాజీలతో కలిసి కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాబోధనలో యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు ప్రశంస నీయమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాం డెంట్ పాటిబండ్లవిష్ణువర్ధన్, కమిటీ సభ్యులు గింజుపల్లి వరప్రసాద రావు, బొల్లేపల్లి శ్రీనివాసరావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే పెన్షన్ కానుక

● వైద్యశాఖ మంత్రి విడదల రజని

గుంటూరు సిటీ, జనవరి 3: వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులకు ప్రతి నెల 1న రూ.3000 నగదు ఇంటి ముంగిటకే అందిస్తూ సంక్షేమ పథకాల అమల్లో దేశానికే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపామని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రి విడదల రజని అన్నారు. బుధవారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3000 పెంపుదల వారోత్సవాలలో రాష్ట్ర మంత్రి విడదల రజని, జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ హెనీ క్రిస్టీనా, జేసీ రాజకుమారి, కమిషనర్ కీర్తీ చేకూరి, మేయరు కావటి శివనాగ మనోహరనాయుడు, తూర్పు శాసనసభ్యులు మహమ్మద్ ముస్తఫా తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి విడదల రజని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు సీఎం జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ పెన్షన్‌కానుకను దశల వారీగా రూ.3000 వరకు పెంచారన్నారు. జేసీ మాట్లాడుతూ పెన్షన్ కానుక ద్వారా నగరపాలక సంస్థ పరిధిలో 60,436 మందికి లబ్ధిదారులకు ప్రతి నెల రూ.18.23 కోట్లు అందించటం జరుగుతుందన్నారు. జిల్లాలో 5,86,573 మందికి రూ.165.5293 కోట్లు ప్రభుత్వం ప్రతి నెల అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొ రేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ కార్పొరేషన్ చైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, వైసీపీ నాయకులు నూరి ఫాతిమా పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11213 99854 11225 99854 01877 99854 04047 99854 01614

పారిశుధ్య సమస్యలు తలెత్తకూడదు..

● అధికారులకు జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం

గుంటూరు(కార్పొరేషన్), జనవరి3: పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో నగరలో ఎక్కడా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా, ప్రజారోగ్య రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తిచేకూరి ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కమిషనర్ నగరంలోని వివిధ డివిజన్లలో పర్యటించి ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల సమ్మె వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పెషల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఈఈలు, డిప్యూటీ కమిషనర్ల స్థాయిలో నగరంలో శానిటేషన్ పర్యవేక్షణకు ప్రత్యేకంగా అధికారులకు విధులు కేటాయించామని తెలిపారు. సమ్మెలో లేని కార్మికులను అన్ని డివిజన్లకు కేటాయించాలని, వెహికిల్ షెడ్ లోని డ్రైవర్లు పోగుపడే చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా అధికారులు పర్యవేక్షణ చేయాల న్నారు. కార్మికులను బలవంతంగా సమ్మెలోకి తీసుకువెళ్లవద్దని, విధుల్లో ఉండే కార్మికులను అడ్డుకోవద్దని కార్మికసంఘ నేతలకు సూచించారు. జీఎంసీ అధికారుల సూచనల మేరకు ప్రజలు పారిశుధ్య చర్యలను విధిగా పాటించాలని కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. కమిషనర్‌తో పాటు డిప్యూటీ కమిషనర్లు, ఈఈలు, ఎస్ఎస్‌లు ఉన్నారు.



బాబు ష్యూరిటీ పత్రాలు ఇస్తున్న నసీర్, టీడీపీ నేతలు

లేపేసిన పింఛన్ల లెక్క తేలుస్తాం : నసీర్

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో తొలగించిన పింఛన్ల లెక్క తేలుస్తామని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గుంటూరు ఐపీడీ కాలనీలో బుధవారం ఆయన ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎలక్షన్లకు ముందు అవ్వ తాతలకు రూ.3000 పింఛన్ అంటూ దొంగమాటలు చెప్పిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రూ.2000 ఉన్న పింఛన్‌ను సంవత్సరానికి 250 పెంచి సంవత్సరానికి వారికి రూ. 9 వేలు అందకుండా దగా చేశారన్నారు. సుమారు 6 లక్షల పింఛన్లను కట్ చేసిన జగన్ రెడ్డి ఈరోజు పేపర్లలో పబ్లిసిటీ కోసం తప్పుడు లెక్కలు చూపుతున్నాడని, టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి లెక్కలు కచ్చితంగా బయటకు తీస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందేలా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురే శ్రీనివాసరావు, పుట్టగంటి వెంకటేశ్వరావు, మల్లెంపూడి శ్రీనివాస్, ఈర్ల గురవయ్య, పొందూరు నాగేశ్వరావు, కోట చంద్ర చారి, కృష్ణ మూర్తి, జనసేన నాయకులు రాటంశెట్టి మహేష్, గణప శ్రీనివాసరావు పాల్గొన్నారు

షర్మిలకు కాంగ్రెస్ నేతల ఘన స్వాగతం

గుంటూరు, జనవరి 3: వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. షర్మిల తనయుడి వివాహానికి తాడేపల్లిలోని సీఎం జగన్‌కు ఆహ్వానం పలికేందుకు బుదవారం వచ్చిన ఆమెను గన్నవరం విమానాశ్రయంలో జిల్లాకు చెందిన ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నాయకులు చిలకా విజయ్, చెరుకూరి శ్రీను, సయ్యద్ జబీవుల్లా, శ్రీనివాసరెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కాంగ్రెస్‌లోకి రావాలని, తద్వారా పార్టీకి పూర్వవైభవం తీసుకు రావాలని ఆమెను కోరినట్లు తెలిపారు.



షర్మిలకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేతలు జగన్మోహన్‌రెడ్డి తదితరులు







దిక్సూచి DIKSUCHI

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)కి చెందిన నాన్ ఫార్మల్ కోర్సెస్ అండ్ రిసోర్సెస్(ఎన్ఎఫ్‌సీఏఆర్) విభాగం- ప్రొఫిషియెన్సీ కోర్స్ ఇన్ ఇంగ్లీష్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు వ్యవధి 40 గంటలు. ఇందులో ప్రధానంగా ఇంగ్లీష్‌కు సంబంధించి రిటెన్, స్పోకెన్ స్కిల్స్ నేర్పిస్తారు. ఫిబ్రవరి 5 నుంచి మార్చి 1 వరకు నాలుగు వారాలు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు ఉంటాయి. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజెనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ వంటి కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తారు. మొదటి వారంలో ఇంట్రడక్షన్స్, డిస్క్రిప్షన్, నరేషన్, ప్లానింగ్; రెండో వారంలో ఎక్స్‌ప్లయినింగ్, ఇన్‌ఫార్మింగ్, ఇన్‌స్ట్రక్టింగ్/డైరెక్టింగ్, రెస్పాండింగ్; మూడో వారంలో ఎక్స్‌ప్రెసింగ్ ఒపీనియన్, గ్రూప్ డిస్కషన్, నోట్ టేకింగ్, సమ్మరైజింగ్, ఫార్మల్ లెటర్ రైటింగ్; నాలుగో వారంలో సీవీ అండ్ అప్లికేషన్, లెటర్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, అఫీషియల్ రైటింగ్ తరగతులు ఉంటాయి. కోర్సుకు సంబంధించిన మెటీరియల్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కాలేజీ నుంచి ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **కోర్సు ఫీజు:** భారతీయ విద్యార్థులకు రూ.2,500; విదేశీ విద్యార్థులకు రూ.5,000; ఇఫ్లూలో చదువుతున్న విదేశీ విద్యార్థులకు రూ.4,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- దరఖాస్తు ఫారాలను జనవరి 19 వరకు ఇస్తారు.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జనవరి 31
- **ఫోన్ నెం.** 040 27689646
- **వెబ్‌సైట్:** efluniversity.ac.in

ఐఐఎం కాశీపూర్‌లో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(అనలిటిక్స్)



కాశీపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఉద్దేశించిన ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(అనలిటిక్స్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆరు టర్మ్‌లు ఉంటాయి. వ్యాపారవేత్తలు, ఆంత్రప్రెన్యూర్స్, ఇంజనీర్లు, నాన్ ఇంజనీర్లు, మిడ్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు అప్లయ్ చేసుకోవచ్చు. అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇది ఆన్‌లైన్ బ్లెండెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్ అయినప్పటికీ కొన్ని ఆన్ క్యాంపస్ తరగతులు కూడా నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఫ్యాకల్టీ వర్చువల్ మీటింగ్స్, అసైన్‌మెంట్లు, క్విజ్‌లు, పెడగాగి క్లాసెస్, సిమ్యులేషన్స్, ఇండస్ట్రీ వర్క్‌షాప్స్, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు, ఇతర ప్రాజెక్ట్ వర్క్‌లు, టర్మ్ ఎండ్ ఎగ్జామ్స్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 34.5 క్రెడిట్లు నిర్దేశించారు.

IIM KASHIPUR

అర్హత

గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.2,950

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 6

వెబ్‌సైట్: iimkashipur.ac.in

ఎంఎస్ఈలో పీజీ డిప్లొమా

మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎంఎస్ఈ) ఆధ్వర్యంలోని బిజినెస్ స్కూల్ - పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఫుల్ టైం ప్రోగ్రామ్. దీని వ్యవధి రెండేళ్లు. ఫైనాన్స్, రీసెర్చ్ అండ్ బిజినెస్ అనలిటిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. జాతీయ పరీక్ష స్కోర్, అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు కనీసం 70 శాతం మార్కులు ఉండాలి. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ చదివిన అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. క్యాట్/జీమ్యాట్/ఎక్స్ఏటీ/మ్యాట్/సీమ్యాట్/ఏటీఎంఏ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** రౌండ్ 1కు ఫిబ్రవరి 19; రౌండ్ 2కు మే 6; రౌండ్ 3కి జూలై 1
- **ఇండక్షన్ ప్రోగ్రామ్:** జూలై 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.mse.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/KXuANaqలో చదవండి.

జేఈఈ మెయిన్ ప్రిపరేషన్ టిప్స్

ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన తొలి వడపోతఅయిన జేఈఈ మెయిన్ మొదటి సెషన్ మరో ఇరవై రోజుల్లో ఆరంభం కానుంది. ఇంటర్ లేదంటే పన్నెండో తరగతి ఎగ్జామ్స్‌కు ముందే జరిగే ప్రవేశ పరీక్ష ఇది. ఒకరకంగా ఎంట్రెన్స్ అంటే భయం, బెరుకు ఏదైనా ఉంటే దీంతో అవి పోగొట్టుకోవచ్చు. ఇది చక్కగా రాస్తే, మంచి స్కోర్ సాధించగలిగితే ఇంటర్ పరీక్షలు తరవాత సెలవులు ఎంజాయ్ చేయవచ్చు. అలాగే ఐఐటీలో చేరేందుకు ఉద్దేశించిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌పై గురిపెట్టవచ్చు. ఈ నేపథ్యంలో ఉన్న ఈ కొద్ది రోజులను సద్వినియోగం చేసుకునేందుకు నిపుణులు సూచించిన కొన్ని టిప్స్

● నేర్చుకున్నది చాలు, ఈ కొద్ది రోజులు రివిజన్‌కు సమయాన్ని ఉపయోగించాలి. ముఖ్యమైన ఫార్ములాలు, థీరమ్స్, రియాక్షన్స్ వంటివి ప్రాక్టీస్ చేయాలి. ప్రాబ్లెమ్స్ సాల్వ్ చేసేందుకు ఇవన్నీ తోడ్పడతాయి. బలంగా ఉన్న వాటిపైనే మరింత శ్రద్ధవహించాల్సిన సమయం ఇది. వచ్చిన వాటినే మరిన్ని సార్లు చదవడం లేదంటే ప్రాక్టీస్ చేయడంతో మైండ్‌లో ఆ టాపిక్ స్థిరపడుతుంది. పరీక్షలో మరింత బాగా ఆన్సర్ చేసేందుకు ఉపయోగపడుతుంది.

● రివిజన్ కోసం షార్ట్ నోట్స్‌ని ఉపయోగించుకోవాలి. అందులో ఫార్ములాలు, కాన్సెప్ట్స్ ఉండేలా చూసుకోవాలి. టాపిక్స్‌లోకి వెళ్లి, ఇవన్నీ ఎక్కడ ఉన్నాయన్నది సరిచూసుకోవడం కష్టం. అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఇది మంచి మార్గం. అలాగే ఫ్లాష్ కార్డులతోనూ ప్రయోజనం ఉంటుంది.


● సబ్జెక్టు లేదంటే ప్రత్యేకించి టాపిక్‌పరంగా ఏవైనా సందేహాలు ఉంటే వాటిని వెంటనే నివృత్తి చేసుకోవాలి. టీచర్ నుంచి సీనియర్ వరకు ఈ విషయంలో ఎవరితో అయినా మాట్లాడవచ్చు. సందేహం తీరడం ముఖ్యం. కాన్సెప్టులను క్షుణ్ణం గా అర్థం చేసుకోవడం కూడా కీలకం.

● సాధ్యమైనన్ని మాక్ టెస్టులు రాయాలి. ఆలిండియా స్థాయిలోవి రాస్తే మంచిది. ఇవి రాస్తే అసలు పరీక్షను ఎదుర్కోవడం సులువు అవుతుంది. ఒకటి రెండు మాక్ టెస్టులు రాసి, పాత పేపర్లను సాల్వ్ చేయడం మరో పద్ధతి. అయితే అది అంత ప్రాక్టికల్‌గా అనిపించదు. దానికి బదులు రోజుకో టెస్ట్ రాసి విశ్లేషించుకోవడం చాలా మంచిది. ఎక్కడ తప్పు చేశామో గుర్తించి, దాన్ని తిరిగి నేర్చుకుంటే కలకాలం గుర్తుంటుంది. అసలు పరీక్షలో సరిగ్గా అదే సమస్యవస్తే సులువుగా గుర్తుకొస్తుంది. అందుకే ఆలిండియా స్థాయిలో జరిగే మాక్‌టెస్టులను ఎంచుకోవాలని విజ్ఞులు చెబుతూ ఉంటారు.

● అర్థరాత్రి వరకు చదవడానికి ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపుతారు. అయితే అంత సీన్ అవసరం లేదు. రాంగ్ ప్రాక్టీస్ కూడా. పరీక్షలు ముంచుకొస్తున్న ఈ సమయంలో సరిపోను విశ్రాంతి, నిద్ర ఆరోగ్యకరమైన ఆహారం చాలా అవసరం.

● పాజిటివ్ మైండ్‌సెట్‌ను డెవలప్ చేసుకోవాలి. అర్జునుడికి పక్షి కన్నుపై గురి మాదిరిగా రాసే పరీక్షలో సక్సెస్ లక్ష్యం కావాలి. ఒత్తిడి(స్ట్రెస్) అనిపిస్తే వెంటనే మరో ఫన్నీ యాక్టివిటీతో మైండ్‌ను ఫ్రెష్ చేసుకోవాలి. కొద్దిసేపు ఇష్టమైన వాటిపై దృష్టిపెడితే చాలు, ఒత్తిడి చాలావరకు తగ్గుతుంది.

●కాన్సంట్రేషన్ లెవెల్స్ పెంచుకోవడం అన్నది కీలకమే. అందుకే గంటల కొద్దీ చదవకూడదని అంటారు. రెగ్యులర్ బ్రేక్స్ అలాగే ఆ సమయంలో యోగా తదితర కార్యకలాపాలతో మైండ్‌ని ఫ్రెష్‌గా ఉంచుకోవాలి. అదేవిధంగా ప్రిపరేషన్‌పై ఎవరితోనూ చర్చించాల్సిన అవసరం లేదు. పరీక్షకు ప్రిపేర్ కావడం అన్నది వ్యక్తిగతం. అది ఎలా ఉండాలన్నది మనమే నిర్ణయించుకోవాలి.



పరీక్ష హాలులో

● జేఈఈ మెయిన్ ప్రశ్నలను చూసుకునేందుకు మొదట కొద్ది సమయాన్ని ఉపయోగించుకోవాలి. ఆ సమయంలో అస్సలు ఆందోళన చెందవద్దు. ఏవీ తెలియనట్టు అనిపించినా బెదరవద్దు. గట్టిగా శ్వాస తీసుకుని వదలండి.

● ఎప్పుడైన కొన్ని ప్రశ్నలు కష్టంగా ఉంటాయి. సులువైన ప్రశ్న కనిపించే వరకు ముందుకు కదలండి. ఎక్కడో ఒక చోట ఈజీ ప్రశ్న తగులుతుంది. మొదట దాన్ని సాల్వ్ చేయండి. కాన్ఫిడెన్స్ లెవెల్ పెరుగుతుంది. తరవాత మరొకటి సులువైనది తీసుకోండి. అప్పటికి మీరు కుదురుకుంటారు. ఆ తరవాత ఎదురు ఉండదు. వచ్చినవన్నీ సాల్వ్ చేసుకుంటూ వెళ్లడమే పనిగా ఉండాలి.

● ఒక మాట వినే ఉంటారు. కష్టం మీ ఒక్కరికే సొంతం కాదు. అలాంటి వాళ్లే చాలామంది ఉంటారు. వారిలో మీరు ఒకరు అంతే.

● ప్రశ్న ఏదైనా సాల్వ్ చేసేందుకు కొంత సమయం పెట్టుకోవాలి. రాకుంటే తరవాతి ప్రశ్న చూడాలి. అంతే తప్ప ఒక్క ప్రశ్న దగ్గరే ఆగిపోవద్దు. వచ్చినవి చేసుకుంటూ వెళ్లాలి. అన్నీ అయ్యాక మళ్లీ మొదటి నుంచి వదిలేసినవి చూసుకుంటూ వెళ్లాలి.

● ఎక్కువ ప్రశ్నలు సాల్వ్ చేసేయాలని అనుకోవద్దు. ఎన్ని కరెక్ట్‌గా చేస్తే ఎంత స్కోర్ వస్తుందో మీకు తెలుసు. అది మదిలో పెట్టుకుని పరీక్షలు ఏవైనా రాయాలని గుర్తుంచుకోవాలి. అదే సక్సెస్ రూట్.

ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్

ముంబైలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ)- 'గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్ 2023'కి దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ/ప్రైవేట్/ఐటీఐ కళాశాలలు సహా ఎన్‌సీవీటీ గుర్తింపు పొందిన ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ సెంటర్లలో చదువుతున్న ప్రతిభావంతులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. ఇందులో జనరల్ స్కాలర్‌షిప్, స్పెషల్ స్కాలర్‌షిప్ ఫర్ గర్ల్ చైల్డ్ కేటగిరీలు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, కుటుంబ వార్షికాదాయం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

జనరల్ స్కాలర్‌షిప్

అర్హత: గుర్తింపు పొందిన రెగ్యులర్/ఒకేషనల్ కళాశాల నుంచి ఇంటర్/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి స్థాయి నుంచి ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెడిసిన్/ఇంజనీరింగ్/ఏదేని గ్రాడ్యుయేషన్/ఒకేషనల్/ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ అభ్యర్థులు; డిప్లొమా తరవాత ఇంజనీరింగ్ మొదటి సంవత్సర ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.

స్కాలర్‌షిప్: మెడిసిన్ చదివేవారికి కోర్సు పూర్తయ్యే వరకూ ఏడాదికి రూ.40,000లను మూడు విడతలుగా(రూ.12,000 + రూ.12,000 + రూ.16,000) చెల్లిస్తారు. ఇంజనీరింగ్ చదివేవారికి ఏడాదికి రూ.30,000(రూ.9,000 + రూ.9,000 + రూ.12,000)లు ఇస్తారు. జనరల్ డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు, ఒకేషనల్ కోర్సులు చేసేవారికి ఏడాదికి రూ.20,000 (రూ.6,000 + రూ.6,000 + రూ.8,000) ఇస్తారు.

● కోర్సుకు సంబంధించి వార్షిక పరీక్షల్లో కనీసం 55 శాతం మార్కులు వస్తేనే స్కాలర్‌షిప్ రెన్యువల్‌కు అవకాశం లభిస్తుంది



స్పెషల్ స్కాలర్‌షిప్ ఫర్ గర్ల్ చైల్డ్

- బాలికలకు చదువుపై ఆసక్తి కలిగించేందుకు, వారిని ఉన్నత విద్యలో ప్రోత్సహించేందుకు ఈ స్కాలర్‌షిప్ స్కీమ్‌ను రూపొందించారు.
- **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్/పన్నెండోతరగతి/డిప్లొమా/ఒకేషనల్/ఐటీఐ కోర్సుల్లో అడ్మిషన్ పొంది ఉండాలి.
- **స్కాలర్‌షిప్:** రెండేళ్ల పాటు ఏడాదికి రూ.15,000లను మూడు విడతలుగా (రూ. 4,500 + రూ.4,500 + రూ.6,000) ఇస్తారు.
- కోర్సుకు సంబంధించి మొదటి ఏడాది కనీసం 50 శాతం మార్కులు వస్తేనే స్కాలర్‌షిప్ రెన్యువల్‌కు అనుమతిస్తారు.

ముఖ్య సమాచారం

- కుటుంబ వార్షికాదాయం రూ.2,50,000 మించకూడదు.
- కరస్పాండెన్స్, పార్ట్ టైమ్, ఈవెనింగ్, డిస్టెన్స్, ఓపెన్ యూనివర్సిటీ, సెల్ఫ్ స్టడీ కోర్సులు చేసేవారు; సీఏ/సీఎ స్/ఐసీడబ్ల్యూఏ అభ్యర్థులు ఈ స్కీమ్‌నకు అనర్హులు.
- కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఇద్దరు ఉన్న పక్షంలో ఒకరు బాలిక అయితే ఇద్దరికీ అవకాశం ఇస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 14
- **వెబ్‌సైట్:** https://licindia.in

నవ్య | చిత్రజ్యోతి

నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ సైంధవ్

వెంకటేశ్




"నా సినీ కెరీర్‌లో 75వ చిత్రంగా 'సైంధవ్' లాంటి సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇది నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్. న్యూ ఏజ్ యాక్షన్ థ్రిల్లర్ చేయాలని ఎప్పటి నుంచో ఉన్న కోరిక ఈ చిత్రంతో నెరవేరింది' అని వెంకటేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రమిది. వెంకట్ బోయనపల్లి నిర్మాత. నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెరెమియా ప్రధాన తారాగణం. సంక్రాంతి సందర్భంగా జనవరి 13న 'సైంధవ్' విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ 'ఆకట్టుకునే భావోద్వేగాలతో పాటు అబ్బురపరిచే పోరాట ఘట్టాలు మా సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. తప్పకుండా ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది. ట్రైలర్ అద్భుతంగా వచ్చింది. సినిమా కూడా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంది. సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నాం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'వెంకటేశ్ గారి కెరీర్‌లో మైలురాయి లాంటి సినిమా చేసే అవకాశం నాకు వచ్చింది. ట్రైలర్‌లోనే కథ మొత్తం క్లుప్తంగా చెప్పానంటేనే సినిమాలో ఎంత విషయం ఉందో మీరే ఊహించుకోవచ్చు. ఇది నా బెస్ట్ ఫిల్మ్. వెంకీ 75వ చిత్రాన్ని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోండి' అని చెప్పారు. వెంకట్ బోయనపల్లి మాట్లాడుతూ 'వెంకటేశ్ గారి లాంటి పెద్ద స్టార్‌తో సినిమా చేసే అవకాశం రావడం నా అదృష్టం. సినిమా విందు భోజనంలా ఉంటుంది' అని తెలిపారు.



ప్రముఖ సినీనటి ప్రభ కుమారుని పెళ్లి రిసెప్షన్ మంగళవారం సాయంత్రం హైదరాబాద్ గండిపేటలోని గోల్కొండ రిసార్ట్స్‌లో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి పత్రికాధిపతి వేమూరి రాధాకృష్ణ హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలందించారు. ఆయనతోపాటు సీనియర్ నటులు మురళీమోహన్‌ను కూడా ఈ చిత్రంలో చూడొచ్చు. మరుసటిరోజు బుధవారం ఉదయం గోల్కొండ రిసార్ట్స్‌లో రంగరంగవైభవంగా వివాహం జరిగింది. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై కొత్తదంపతులకు శుభాశీస్సులు అందించారు.

కింగ్‌ఖాన్‌కి కోపమొచ్చింది



షారుక్ రీసెంట్ హిట్ 'డంకీ' ప్రమోషన్‌లో భాగంగా అభిమానులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో వారు అడిగిన ప్రశ్నలకు సరదాసరదాగా సమాధానాలిచ్చేశారు షారుక్. అయితే.. ఓ అభిమాని అత్యుత్సాహంతో అడిగిన ప్రశ్న షారుక్‌ని ఇరిటేట్ చేసింది. 'సార్.. అసలు 'డంకీ' బడ్జెట్ ఎంత? కొందరు 85 కోట్లు అంటున్నారు. కొందరు 120కోట్లు అంటున్నారు. ఇంకొందరేమో మీ రెమ్యునరేషన్ కలుపుకొని 350కోట్లు అంటున్నారు. అసలు నిజం మీ నోటి వెంట వినాలనుంది' అంటూ ఆ అభిమాని ప్రశ్నించగా షారుక్ ముఖ కవళికలు మారిపోయాయి. 'బ్రో.. ఆ విషయాలు నీకవసరమా? బిజినెస్ చేసేవాళ్లకు వదిలెయ్యాలి. ఆ గొడవలు వాళ్లు చూసుకుంటారు. ఉపయోగం లేని విషయాల గురించి ఆలోచించి ఎందుకు టైమ్ వేస్ట్ చేసుకుంటున్నావ్?' అంటూ సున్నితంగా ఆ అభిమానిని మందలించారు షారుక్.

చైనా గోడైనా దూకొచ్చు



నాగార్జున అక్కినేని కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'నా సామిరంగా'. ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకత్వం వహిస్తున్నారు. రాజ్‌తరుణ్ కీలకపాత్రపోషిస్తున్నారు. బుధవారం చిత్ర బృందం రాజ్‌తరుణ్ పాత్రను పరిచయం చేస్తూ గ్లింప్స్ వదిలింది. ఈ చిత్రంలో ఆయన భాస్కర్ అనే కాలేజ్ స్టూడెంట్ పాత్రలో కనిపించనున్నారు. రుక్సార్ థిల్లాన్‌తో రాజ్‌తరుణ్ ప్రేమకథను గ్లింప్స్‌లో ఆవిష్కరించారు. 'తన చిరునవ్వు కోసం చైనా గోడైనా దూకొచ్చు' అంటూ ఆయన పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. జనవరి 14న విడుదలవుతున్న ఈ చిత్రంలో నాగార్జునకు జోడీగా ఆశికా రంగనాథ్ నటిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. అల్లరి నరేశ్ కీలకపాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి. ప్రసన్న కుమార్ బెజవాడ కథ, మాటలు అందించారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర దాశరథి.



టైసన్ నాయుడు బరిలో దిగాడు



తొలి చిత్రం 'భీమ్లానాయక్'తోనే దర్శకుడిగా ఘన విజయం అందుకున్నారు సాగర్ కె. చంద్ర. ఇప్పుడు ఆయన బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి 'టైసన్ నాయుడు' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను యూనిట్ ఖరారుచేసింది. బాక్సింగ్ దిగ్గజం మైక్ టైసన్ అభిమానిగా శ్రీనివాస్‌ను పరిచయం చేసిన గ్లింప్స్ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో ఆయన డీఎస్పీ పాత్రలో అలరించనున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

భక్తిభావంగా రామనామం



తేజ సజ్జ కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను-మాన్'. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై అంచనాలను పెంచాయి. బుధవారం చిత్రబృందం 'శ్రీరామదూత స్తోత్రం' విడుదల చేసింది. భక్తిభావం ఉప్పొంగేలా గౌరహరి స్వరాలందించగా, సాయిచరణ్ భాస్కరుణి, లోకేశ్వర్ ఎడర, హర్షవర్ధన్ చావలి శ్రవణానందంగా ఆలపించారు. ఈ చిత్రంలో అమృత అయ్యర్ కథానాయిక. వరలక్ష్మీ శరత్‌కుమార్, వినయ్ రాయ్, గెటప్ శ్రీను, సత్య కీలకపాత్రలు పోషించారు. ప్రైమ్‌షో ఎంటర్టైన్‌మెంట్‌పై శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర.

గ్రామీణ ప్రేమకథ ప్రారంభం

సీనియర్ నటుడు దేవరాజ్ తనయుడు ప్రణం దేవరాజ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ బుధవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఆకాష్ పూరి క్లాప్ ఇచ్చారు. దేవరాజ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. తనికెళ్ల భరణి చిత్రబృందానికి స్క్రిప్ట్ అందించి, గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు



మాట్లాడుతూ 'నాకు ఇది తొలి చిత్రం. తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ఈనెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అన్నారు. దేవరాజ్ పాన్ ఇండియా హీరో, వాళ్ల బ్బాయి ప్రణం దేవరాజ్ కూడా ఈ రంగంలోకి వచ్చినందుకు ఆనందంగా ఉంది అని తనికెళ్ల భరణి చెప్పారు. ప్రణం దేవరాజ్ మాట్లాడుతూ 'ఇది తెలుగులో నాకు మూడో చిత్రం. మంచి లవ్ స్టోరీ, యాక్షన్ అంశాలతో రూపొందుతోంది' అని చెప్పారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న కుటుంబ కథా చిత్రమిదని నిర్మాత పి. హరికృష్ణ గౌడ్ తెలిపారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jlEtdJ5 లో చదవండి.



వృద్ధులకు పింఛన్లతో ఆసరా: ఎమ్మెల్యే

కొల్లిపర, జనవరి 3: వృద్ధాప్యంలో ఉన్నవారికి పింఛన్లు మరింత ఆసరా అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఎంపీడీవో విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 60సంవత్సరాల నిండిన అవ్వా, తాతలకు నెలకు రూ.3వేలు చొప్పున సంవత్సరానికి రూ.36వేలు ఇచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కొల్లిపర మండలంలో 10వేల 24 మందికి రూ 2కోట్ల 92లక్షల 39వేల 500లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శివకుమార్, ఎంపీపీ భీమవప్ప పద్మావతి, ప్రజాప్రతినిధులతో కలిసి నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాంచారయ్య, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రమేష్, సర్పంచ్‌లు పిల్లి రాధిక, అంబటి సంధ్యాదేవి, బొల్లు కరుణశ్రీ, బొంతు వేణుగోపాల్‌రెడ్డి, సిద్దెల చంద్రబోసు, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




శ్రీరామమూర్తికి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీరవల్లి మురళి, నాగభూషణం, దర్శకుడు దిలీప్‌రాజా

రచయిత శ్రీరామమూర్తి సేవలు చిరస్మరణీయం

● గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి

తెనాలి రూరల్, డిసెంబరు 3: సాహితీవేత్త రావినూతల శ్రీరామూర్తి తెలుగుప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని గణేషయూత్ కన్వీనర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వీరవల్లి మురళి అన్నారు. బుధవారం మండలంలోని అంగలకుదురులో రావినూతల శ్రీరామమూర్తి సంస్మరణ సభను నిర్వహించారు. కార్యక్రమానికి మా ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దర్శకుడు దిలీప్ రాజా, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, స్వరలయ లక్కరాజుసాయిలు పాల్గొని శ్రీరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో దిలీప్ రాజా మాట్లాడుతూ అంగలకుదురు సెంటర్లో శ్రీరామమూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తాను కూడా సహకరిస్తానన్నారు. గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం మాట్లాడుతూ రచయితగా తెనాలి ప్రాంతానికి వన్నెతెచ్చిన శ్రీరామమూర్తి మరణం ఈ ప్రాంత ప్రజలకు తీరనిలోటన్నారు. శ్రీరామమ్మూర్తి రచించిన పాటల సీడీని ఆయన కుమార్తె అన్నపూర్ణ ఆవిష్కరించారు. శ్రీరామమూర్తిపై రాసిన మరోపాటను ఉపాధ్యాయుడు అలపర్తి వెంకటేశ్వరరావు, బోస్‌లతో కలిసి నటుడు బెల్లంకొండ వెంకట్‌బృందం ఆలపించారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యదర్శి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీరామమూర్తి తనయుడు ప్రకాష్, కృపానందం, త్రిమూర్తులు, సుబ్బారావు, అన్నపూర్ణ, పినపాటి సురేష్‌బాబు, పలువురు గ్రామస్థులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

వేలంలో రూ.22,800 పలికిన పందెంకోడి



రూ.22,800 ధర పలికిన పందెం కోడి

తెనాలి రూరల్, జనవరి 3: పందెం కోడికి వేలం నిర్వహించగా రూ.22,800లు పలికింది. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 1న తేలప్రోలు శివారు పంట పొలాల్లో కోడిపందాలు వేస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు పందెం కోళ్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు అప్పగించడంతో వాటిని వేలం వేయాలని ఆదేశించారు. సోమవారం దానిలో ఒక పందెం కోడికి వేలం నిర్వహించగా కఠెవరం గ్రామానికి చెందిన గోపి ఆ పందెం కోడిని రూ.22,800లకు కైవసం చేసుకున్నాడు. ఆ సొమ్మును ప్రభుత్వానికి స్వాధీనం చేసినట్లు తెలిపారు. పందెం కోడి అంతపెద్ద మొత్తంలో పలకడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

పోటీ కార్మికులను అడ్డుకున్న మున్సిపల్ కార్మికులు

తెనాలి అర్బన్, జనవరి 3: పోటీ కార్మికులతో పారిశుధ్య పనులు చేయించడాన్ని సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. 20రోజులకు పైగా మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు కనీస వేతనం కోరుతూ సమ్మె చేస్తున్నారు. వారి సమస్య పరిష్కరించకుండా ప్రభుత్వం రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తుందని సీఐటీయూ నాయకులు కె.బాబుప్రసాద్ విమర్శించారు. బుధవారం పట్టణంలో పలు చోట్ల దినసరి కూలీలను ఏర్పాటుచేసి మున్సిపల్ అధికారులు ట్రాక్టర్లలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. దీంతో సమ్మె చేస్తున్న కార్మికులు పలు ప్రాంతాలలో పారిశుధ్య పనులను అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి కార్మిక సంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే పారిశుధ్య పనులను అడ్డుకుంటామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలి, ములకా శివసాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య ట్రాక్టర్లను అడ్డుకుంటున్న కార్మికులు

స్త్రీ విద్యకు బాటలు వేసిన సావిత్రీబాయిపూలే: టీడీపీ



పొన్నూరులో సావిత్రీబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, మహిళా సమాఖ్య సభ్యులు

పొన్నూరు టౌన్, జనవరి 3: స్వాంతంత్రానికి పూర్వమే స్త్రీ విద్యాభివృద్ధికి బాటలు వేసిన మహనీయురాలు సావిత్రీబాయిపూలే అని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్ కొనియాడారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదాల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబురావు, షేక్ బాజీ సాహెబ్, కరిముల్లా బాజీ, పఠాన్ ఫైరోజ్ ఖాన్, షేక్ సిలార్ బాషా, సీతరామయ్య తదితరులు పాల్గొన్నారు.



తెనాలిలో టీడీపీ నాయకుల నివాళి

● పొన్నూరు టౌన్: బాలికల విద్య కోసం జీవితాన్ని అర్పించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిపూలే అని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా సభ్యురాలు అంగలకుదురు దుర్గాభవానీ అన్నారు. పట్టణలోని డీవీసీ కాలనీలో బుధవారం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం సావిత్రీబాయిపూలే జయంతిని నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య సభ్యులు ఆర్ లక్ష్మి, ఆశ, సామ్రాజ్యం, సుగుణ, మంగమ్మ పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పావులూరు రాంబాబు, రావి తేజ, జొన్నాదుల మహేష్, ఫణిదపు దుర్గ, మల్లవరపు విజయ్‌కుమార్, కుదరవల్లి శ్రీను, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, కనకరాంబాబు, దుర్గ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు

తెనాలి, మారీసుపేట జనవరి 3: పట్టణంలో పేదప్రజల కోసం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకులు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో బుధవారం బొల్లేపల్లి వెంకటనారాయణ 4వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం చేశారు. శివాజీచౌక్‌లో మాజీమంత్రి ఆలపాటి రాజా దంపతుల సహకారంతో ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాదల కోటేశ్వరరావు, వెనిగళ్ళ శివప్రసాద్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, క్రొత్తపల్లి రమేష్, సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, ముళ్ళపూడి వెంకట్, గుమ్మడి ప్రసాద్ పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీని గెలిపించుకుందాం

● మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు అనిత

తెనాలి రూరల్, జనవరి 3: మహిళలకు అండగా నిలిచే తెలుగుదేశం పార్టీ చంద్రబాబు నాయుడుని రానున్న ఎన్నికల్లో గెలిపించుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం బాటలో ముందుకు నడుపుదామని మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు కిలారి అనిత చెప్పారు. బుధవారం మండలంలోని నందివెలుగులో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించి బాబు ష్యూరిటీ బాండ్లను అందించారు. కార్యక్రమంలో యనమదల అనిత, నన్నపనేని లింగారావు, షేక్‌భాషు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

తెనాలి రూరల్, జనవరి 3: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ళ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండంలోని నందివెలుగులో బెల్ట్ షాపు నిర్వహిస్తూ మద్యం విక్రయాలు చేస్తున్న తిన్నలూరి శ్రీనివాసరరావును అదుపులోకి తీసుకుని అతడి వద్ద 6క్వార్టర్ల మద్యం బాటిళ్లను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నూతన బ్రాంచ్ ప్రారంభం

తెనాలి, మారీసుపేట జనవరి 3: స్థానిక కొత్తపేటలో బుధవారం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నూతన శాఖను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావు పాల్గొని బ్రాంచ్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని అన్నారు. జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ జోనల్‌లో ఇది 41వ బ్రాంచి అని పట్టణ ప్రజల అవసరాల మేరకు తమ శాఖ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ సాయి నవీన్, డిప్యూటీ జోనల్ మేనేజర్ రజనికుమార్, ఉప్పల వరదరాజులు, తాడిబోయిన బుచ్చిరాజు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: ధూళిపాళ్ల



అగ్ని బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, జనవరి 3: అగ్ని బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని మన్నవ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. మన్నవ గ్రామానికి చెందిన బండ్లమూడి నల్లరావు, చెల్ల సిలువరాజు గృహాలు ప్రమాదంలో కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ బుధవారం మన్నవ గ్రామానికి విచ్చేసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు తదితరులు పాల్గొన్నారు. అలాగే అగ్ని బాధిత కుటుంబాలను తహసీల్దార్ శ్రీకాంత్ ఖేదార్నాధ్ పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం, బియ్యం, దుప్పట్లు, వంట సామగ్రి అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి ధూళిపాళ్ళ నివాళి

చేబ్రోలు, జనవరి 3: మండల కేంద్రమైన చేబ్రోలు కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కె.వీరయ్య మంగళవారం రాత్రి మృతిచెందారు. వీరయ్య మృతి సమాచారం తెలుసుకున్న నరేంద్రకుమార్ బుధవారం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి వెళ్లి పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి వీరయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వీరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బాలురోన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

తెనాలి అర్బన్, జనవరి 3: మున్సిపల్ బాలురోన్నత పాఠశాలలో బుధవారం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం షేక్ మౌలాబి మాట్లాడుతూ, బాలికలు విద్య కోసం పాఠశాలలను స్థాపించి స్త్రీ విద్యను ప్రోత్సహించారని చెప్పారు. తన్నీరు శివశంకర్, చుక్కా భాను ప్రసాద్, నరేంద్ర, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీతాలు ఇచ్చేందుకు సర్పంచ్ అడ్డుపడుతోంది

● కొలకలూరు ఇన్‌చార్జ్ సెక్రటరీ కల్పన ఆరోపణ

తెనాలి రూరల్, జనవరి 3: కొలకలూరు గ్రామ పంచాయతీలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసే పారిశుధ్య కార్మికులకు, ట్రాక్టర్, ట్యాంకర్ డ్రైవర్లకు నెలవారీ జీతాలు అందించకుండా పంచాయతీ సర్పంచ్ చొప్పర ప్రీతి అడ్డుపడుతోందని గ్రామ ఇన్‌చార్జ్ కార్యదర్శి సూరపనేని కల్పన ఆరోపించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గ్రామంలో పనిచేసే కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు అందించేందుకు బిల్లుపై తాను సంతకం పెట్టడం జరిగిందని సర్పంచ్ మాత్రం సంతకం పెట్టడంలేదని ఫలితంగా కార్మికులకు సకాలంలో జీతాలు అందించలేకపోతున్నామన్నారు. గత కొన్ని రోజులుగా జీతాలు అందకపోవడంతో కార్మికులు విధులకు రావడంలేదని గ్రామంలో పారిశుధ్యం లోపించడంతో కార్మికులను పిలిచి సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు. సకాలంలో తమకు రావల్సిన జీతాలు ఇవ్వకపోవడమే తప్ప మరే సమస్యలేదని తెలిపారని వారి జీతాలు చెల్లింపుల్లో తాను బాధ్యత తీసుకుంటానని హామీ ఇవ్వడంతో విధులకు వస్తున్నారని తెలిపారు. అయితే చెక్కుపై సర్పంచ్ సంతకం చేయడంలేదని పంచాయతీ తరుపున గ్రామ అభివృద్ధికి ఆటంకం ఏర్పడే పరిస్థితి నెలకొందన్నారు. గ్రామంలో పరిశుభ్ర వాతావరణం అందించాలన్న సంకల్పం నీరుగారిపోతుందని ఇప్పటికైనా సర్పంచ్ సంతకం చేసి గ్రామాభివృద్ధికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

మాచవరంలో విద్యాజ్యోతి పుస్తకాల పంపిణీ

పొన్నూరు టౌన్, జనవరి 3: పదో తరగతి పరీక్షా ఫలితాలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని మండల పరిషత్ అధ్యక్షురాలు భవనం పద్మలీల అన్నారు. మండల పరిధిలోని మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు పది పరీక్షలకు సన్నద్ధులవటంపై అవగాహన కల్పించారు.

రవికిషోర్ బాధ్యతల స్వీకారం

తెనాలి, మారీసుపేట, జనవరి 3: స్థానిక కొత్తపేటలోని పోస్టల్ డివిజన్ సూపరింటెండెంటు కార్యాలయంలో బుధవారం తెనాలి పోస్టల్ డివిజన్ ఎడహాక్ సూపరింటెండెంటుగా శొంఠి రవికిషోర్ చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని పోస్టు ఆఫీసులలో తపాలా సేవలందరికీ అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

తెనాలి, మారీసుపేట జనవరి 3: స్థానిక ఇస్లాంపేటలోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో బుధవారం ఏఐఎస్ఎఫ్ సాను భూతిపరుడు శివమణి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పలకలను పంపిణీ చేశారు. అదేవిధంగా మనఇల్లు వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మద్దినేని కిరణ్, షేక్ హనీఫ్, శివ, సాయి, తాడిబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



